జూదాలపై నిఘా : డిఐజి

ప్రజాశక్తి-అనంతపురం

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కోడి పందేలు, పేకాట ఇతర జూదాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని డిఐజి ఎం.రవిప్రకాష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కోడి పందేలు, జల్లికట్టు, జూద క్రీడలు నిర్వహించడం నిషేధమన్నారు. దీనిని అతిక్రమించి ఏవరైనా ఈ జూదం ఆడినా, ప్రోత్సహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సాంప్రదాయ క్రీడలు నిర్వహించుకుని భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ మహిళా పోలీసులను సమన్వయం చేసుకుని సిఐలు, ఎస్ఐలు గ్రామ పెద్దలుతో సమావేశాలు నిర్వహించి నిషేధిత జూదాలు, క్రీడలు జరుగకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో కోడి పందేలు, ఇతర జూదాలు నిర్వహించిన వారిని ముందస్తుగా బైండోవర్ చేయాలన్నారు. ఎక్కడైనా జూదాలు జరుగుతుంటే డయల్-100కు ఫిర్యాదు చేయాలని ఆయన ప్రజలకు సూచించారు.

గుంతకల్లులో ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

ప్రభుత్వానివి వట్టి మాటలే..!

- పేదలందరికీ గృహాల మంజూరులో జాప్యం
- రూ.5లక్షలతో ఇల్లు నిర్మించి ఇవ్వాలి
- కబ్జాల్లో ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోండి
- సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-గుంతకల్లు

పేదలందరికీ ఇళ్ల విషయంలో ప్రభుత్వం వట్టి మాటలు చెబుతోంది తప్పా, ఆచరణలో చేస్తున్నది శూన్యం అని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ విమర్శించారు. పేదల ఇళ్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం గుంతకల్లు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నాడు నిరసన తెలిపారు. హంపిరెడ్డి భవనం నుంచి పేదలతో కలిసి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారం లోకి రాకముందు పేదలకు ఇళ్లు కాదని జగనన్న ఊళ్లను నిర్మిస్తామని ఆ పార్టీ నాయకులు గొప్పలు చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లు గడచినా ఒక కాలనీ కూడా నిర్మించిన దాఖలాలు లేవన్నారు. గత నెల 21వ తేదీన జిల్లాలో 25 వేల ఇళ్లను నిర్మించి ఇస్తామని మంత్రులు ఆర్భాటం ప్రకటన చేశారన్నారు. ఆచరణలో ఇది అమలుకు నోచుకోలేదన్నారు. జిల్లాలో మంజూరు చేసిన గృహాల్లో కనీసం పదిశాతం గృహాలు కూడా పూర్తవని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం మితిమీరిన నిబంధనలు, పెరిగిన గృహ ముడిసరుకుల ధరలు, జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల లేమితో నిర్మాణాలు ముందుకు సాగడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నిర్మాణ వ్యయాన్ని రూ.5 లక్షలకు పెంచి లబ్ధిదారులకు ఇళ్లను నిర్మించి ఇవ్వాలన్నారు. గుంతకల్లు మండలంలో 37-బి, 43-1, 47-బి, 48-ఏ2, 48-బి,49-ఏ1, 550 నుంచి 553 వరకు సర్వే నెంబర్లలోని ప్రభుత్వ భూములను అధికార పార్టీ నాయకులు కబ్జా చేశారన్నారు. పామిడి, గుత్తి మండలాల్లో కూడా కోట్లాది రూపాయలు విలువైన భూములు కబ్జాకు గురయ్యాయని చెప్పారు. వీటికి సంబంధించిన ఆధారాలు తమవద్ద ఉన్నాయని, వాటిని అధికారులకు ఇస్తామన్నారు. అధికారులు స్పందించి వెంటనే ఈ భూములను వెనక్కు తీసుకుని పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. వివిధ ప్రాంతాల్లో పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇవ్వాలన్నారు. ఈ సమస్యలపై ప్రభుత్వం స్పందించక పోతే పేదలను సమీకరించి ఫిబ్రవరి నెల మొదటి వారంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట వంటావార్పు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీవో జె.రవీంద్రకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, మండల కార్యదర్శి దాసరి శ్రీనివాసులు,పట్టణ కమిటీ కార్యవర్గ సభ్యులు మారుతిప్రసాద్, కసాపురం రమేష్, సాకే నాగరాజు, రాము రాయల్, తిమ్మప్ప, సి.రమేష్, షబ్బీర్ పాల్గొన్నారు.

రైతు కోసం 'జీవనరేఖ'

- నిస్పృహలోనున్న వారికి భరోసా
- ఆమిద్యాల రైతులతో అధికారుల సమావేశం
- ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

నిత్యం కరువుకు నిలయమైన అనంతపురం జిల్లాలో వ్యసాయంపై ఆధారపడిన రైతన్న జీవితాలు దుర్భరంగా మారాయి. వ్యవసాయం కోసం పెట్టిన పెట్టుబడులు సైతం తిరిగి రాక అప్పుల ఊబిలో కూరుకుపోయి ఉన్నారు. దీంతో నిరాశ నిస్పృహకు లోనైన వారు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దశాబ్దాలుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్నదాతల ఆత్మహత్యల ఘటనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు ప్రభుత్వాలు ఎక్స్‌గ్రేషియా సైతం ఇస్తున్నాయి. అయితే తాజాగా జిల్లా అధికార యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా రుణభారంతో ఇబ్బందులు పడి నిరాశకుగురైన వారుంటే ముందుగానే గుర్తించి వారిలో మనోధైర్యం నింపే కార్యక్రమాన్ని 'జీవన రేఖ' పేరుతో చేపడుతున్నారు. దీనికి కింద ఆర్డీవో స్థాయి అధికారి ఒకరు బాధితులతో మాట్లాడి వారికి ఏ రకంగా ఆదుకోగలమన్నది పరిశీలించి చర్యలు చేపట్టే ప్రయత్నాన్ని ఈ కార్యక్రమం ద్వారా చేపట్టారు. ఆర్డీవో, తహశీల్దార్, ఎంపిడిఒ, ఐకెపి, వ్యవసాయాధికారులు అందరూ కలసి ఆ రైతుకుటుంబం ఆత్మహత్య వైపు వెళ్లకుండా రుణభారం నుంచి ఏ రకంగా బయటపడేయాలన్న దానిపై అవగాహన కల్పించనున్నారు. ఇందులో భాగంగా మంగళవారం నాడు మూడు రైతు కటుంబాలతో అనంతపురం జిల్లా ఉరవకొండ తహశీల్దారు కార్యాలయంలో గుంతకల్లు ఆర్డీవో జె.రవీంద్ర మాట్లాడారు. వారి బాధలు, సమస్యలను విన్నారు. ఆదుకుంటామని భరోసాను కల్పించారు. ఈ సందర్భంగా బాధిత రైతు కుటుంబాలు వారి బాధలను అధికారుల వదద ఏకరువు పెట్టారు.

అప్పులవాళ్లు ఇబ్బందులు పెడుతున్నారు...
గంగమ్మ, ఆమిద్యాల గ్రామం.

తన భర్త రామాంజినేయులు గతేడాది జులై 28వ తేదీన అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. మూడు ఎకరాలను కౌలుకు సాగు చేసేవాడు. పంట సాగు నిమిత్తం రూ.12 లక్షలు అప్పులయ్యాయి. వాటిని తీర్చలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తనతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమారుడు వెంకటేశ్ ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కూతురిని పదవ తరగతికే చదువు మాన్పించేశాం. నేను, నా కూతురు పనికెళ్తేనే కుటుంబం గడుస్తుంది. ప్రభుత్వం నుంచి ఏడు లక్షల రూపాయలు పరిహారం ఇటీవలనే వచ్చింది. వచ్చిన దాంట్లో మూడున్నర లక్షల రూపాయలు బ్యాంకులో అప్పుకు కట్టేశాం. మిగిలిన రెండు లక్షల వరకు చిన్నచిన్న అప్పులు తీర్చాం. ఇంకా తొమ్మిది లక్షల వరకు అప్పు ఉంది. అప్పుల వాళ్లకు అంతా ఇవ్వలేం. కొంత ఇస్తామని వేడుకున్నాం. దీనిపై సిఐ అప్పులిచ్చిన వారిని పిలిపించి మాట్లాడినా వినటం లేదు. మొత్తం అప్పు కట్టాలంటున్నారు. అంతా కట్టే స్తోమత మా వద్ద లేదు. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద అప్పు చెల్లించే విధంగా చూడాలి అని గంగమ్మ ఆర్డీవోకు విన్నవించింది. దీనిపై ఆర్డీవో స్పందిస్తూ డీఎస్పీతో మాట్లాడి అప్పులవారు ఇబ్బంది పెట్టకుండా చర్యలు చేపడతామని హామీనిచ్చారు. బతుకుదెరువు కోసం కిరాణ దుకాణం పెట్టుకునే విధంగా స్వయం సహాయక సంఘం ద్వారా కృషి చేస్తామని హామీనిచ్చారు.

ఆత్మహత్యే శరణ్యంగా ఉంది...
వెంకటేశ్, రైతు

తనకు మూడు ఎకరాల పొలముంది. మరో మూడు ఎకరాలు పెన్న అహోబిలం దేవాలయ భూములను కౌలకు తీసుకుని సాగు చేస్తున్నాం. పంటలు పండక అప్పుల బాధలు పెరిగాయి. ఐదు లక్షల వరకు అప్పు అయింది. తీర్చే మార్గం కనిపించడం లేదు. ఆత్మహత్యనే శరణ్యమనుకుంటున్నా అంటూ రైతు వెంకటేష్ ఆర్డీవో ఎదుట వాపోయాడు. దీనిపై ఆర్డీవో స్పందిస్తూ ప్రభుత్వపరంగా అండగా ఉంటామన్నారు. వ్యవసాయంతోపాటు అనుబంధంగా ఆదాయ మార్గం పెంచుకునే విధంగా చర్యలు చేపడతామని భరోసా ఇచ్చారు. పాడి, పశుపోషణ ద్వారా ఆదాయం పెరిగే విధంగా కృషి చేస్తామని, అధైర్యపడొద్దని హామీనిచ్చారు.

రైతు కుటుంబంతో ఆర్డీవో తదితరులు

జీవనరేఖ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్లు విడుదల చేస్తున్న అధికారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

ప్రభుత్వం నుంచి సహకారం
ఆర్డీవో జె.రవీంద్ర

రైతులకు అండగా ప్రభుత్వంతోపాటు, అధికార యంత్రాంగం అండగా ఉంటుంది. ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదు. అవసరమైన సహకారాన్ని అందించేందుకు కృషి చేస్తాం. 'జీవనరేఖ' ద్వారా వచ్చిన సమస్యలను కూడా పరిశీలించి ఉన్నతాధికారులతో మాట్లాడటమే కాకుండా అన్ని శాఖల సమన్వయం చేసుకుని రైతుకు భరోసా కల్పిస్తాం.

అందరం అండగా నిలుద్దాం
భానుజ, రెడ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి.

నిరాశ నిస్పృహలోకెళ్లి రైతులు ఆత్మహత్యలు చేసుకోక ముందే వారికి భరోసాని కల్పించడంలో భాగంగా రైతుమిత్ర పేరుతో కార్యక్రమాన్ని చేపట్టాం. ఈ పద్ధతిని జిల్లా జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ దృష్టికి తీసుకెళ్తే ఆయన చొరవ చూపి 'జీవన రేఖ' అని పేరు పెట్టి అధికార యంత్రాంగాన్ని భాగస్వామ్యులను చేశారు. దీని వలన ఇబ్బందుల్లో ఉన్న రైతాంగానికి కొంత వరకైనా తోడ్పాటు సహకారాన్ని అందించేందుకు వీలు కలుగుతుంది. మొదటి కార్యక్రమంగా ఉరవకొండలోని ఆమిద్యాలలో చేపట్టాం. ఇక్కడ ఇప్పటి వరకు జరిగిన రైతు ఆత్మహత్యల్లో అత్యధికంగా నమోదయిన గ్రామంగా ఆమిద్యాల ఉంది. ఈ ఒక్క గ్రామంలోనే తొమ్మిది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. అందుకే ఇక్కడి నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించాం. ఇది మరింత విజయవంతమై రైతు ఆత్మహత్యల్లేని జిల్లాగా మార్చేందుకు అందరం కలసి కృషిచేద్దాం.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

రైతులలకు రుణాలివ్వండి

బ్యాంకర్లను కోరిన కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో రైతులకు విరివిగా వ్యవసాయ రుణాలు ఇవ్వాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి బ్యాంకర్లను కోరారు. మంగళవారం ఉదయం స్థానిక ఏడీసీసీ బ్యాంకు కార్యాలయంలో కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సాంకేతిక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయంలో పంటల వారీగా పెరుగుతున్న ఖర్చులు, బయట వడ్డీ వ్యాపారుల నుంచి పొందే రుణాల కారణంగా రైతుల మీద పడే రుణభారాన్ని దష్టిలో ఉంచుకుని బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలన్నారు. కౌలు రైతులకు సైతం సాధారణ రైతుల తరహాలో రుణాలు ఇవ్వాలన్నారు. పంట రుణాల రెన్యువల్ సమయంలో వడ్డీతో సహా మొత్తం సొమ్ము కట్టాలని కోరడం వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారని, కేవలం వడ్డీ కట్టించుకుని రుణాలు రెన్యూవల్ చేయాలని విజ్ఞప్తి చేశారు. బ్యాంకర్లు, స్వచ్ఛంద సేవా సంస్థల సలహాలు, సూచనల ఆధారంగా వివిధ పంటలకు 'స్కేల్ ఆఫ్ ఫైనాన్స్' అంచనాలు రూపొందించారు. ఈ కార్యక్రమంలో ఏడీసీసీ బ్యాంకు ఛైర్‌పర్సన్ లిఖిత, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రా నాయక్, ఎల్డీఎం నాగరాజా రెడ్డి, నాబార్డు డీడీఎం అనురాధ, ఏడీసీసీ బ్యాంకు సీఈవో రామ్‌ప్రసాద్, బ్యాంకు జీఎం సురేఖరాణితో పాటు బ్యాంకుల ప్రతినిధులు, వ్యవసాయ సంబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కౌలురైతుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్

జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

ప్రజాశక్తి-గార్లదిన్నె

కౌలు రైతుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయాధికారి కార్యాలయంలో కౌలురైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఏమైనా సమస్యలు, సందేహాలు ఉంటే జిల్లా వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ నెంబర్లకు ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. అలాగే కౌలు రైతులు ఖచ్చితంగా సిసిఆర్‌సి కార్డు తీసుకోవాలన్నారు. ఈ కార్డు తీసుకుంటే ప్రభుత్వం నుంచి వచ్చే పంట రుణాలను తీసుకోవచ్చున్నారు. అలాగే తప్పనిసరిగా కౌలు రైతులు సాగు చేసిన పంటను ఈక్రాప్ బుకింగ్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యసాయాధికారి సోమశేఖర్, ఎఇఒ స్రవంతి, విహెచ్ఎలు ఫరేషా, ఆదినారాయణ, రైతులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

జీవో 1 అమలు అప్రజాస్వామికం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సిఐటియ నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రోడ్‌షోలు, ర్యాలీలు నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం:1 అప్రజాస్వామికమైనదని, తక్షణం దీనిని రద్దు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. జీవో 1ని రద్దు చేయాలని, అంగన్వాడీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిఐటియు రాప్తాడు మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సిఐటియు మండల నాయకులు పోతులయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ ధర్నాలో నాగేంద్ర కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పాలన పిచ్చితుగ్లక్ పరిపాలన కంటే దుర్మార్గంగా ఉందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే జీవో 1ని తెచ్చారన్నారు. పోరాడి సాధించుకున్న పౌరహక్కుల్ని ఏ పేరుతో అణచివేసినా వ్యతిరేకంగంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. అంగన్‌వాడీలు దీర్ఘకాలింగా కోరుతున్న కనీస వేతనం రూ.26 వేలు ఇతర సమస్యలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు బెంగుళూరులో జరిగే సిఐటియు అఖిలభారత మహాసభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టనున్నట్లు చెప్పారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు అరుణ, ఓబులమ్మ, విజయలక్ష్మి, లక్ష్మి, హమాలీ యూనియన్ నాయకులు బ్రహ్మ, మల్లేష్, సుబ్బారావు, నారాయణస్వామి పాల్గొన్నారు.

ముగ్గులు వేస్తున్న మహిళలు

పోలీసు కుటుంబాలకు ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో పోలీసు కుటుంబాలకు సంక్రాంతి ముగ్గుల పోటీలను మంగళవారం నిర్వహించారు. ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప కాగినెల్లి ఆదేశాల మేరకు అదనపు ఎస్పీలు ఇ.నాగేంద్రుడు, ఏ.హనుమంతుల ఆధ్వర్యంలో వీటిని నిర్వహించారు. ఈ పోటీల్లో పోలీసు కుటుంబాలకు చెందిన 19 మంది పాల్గొన్నారు. పోటీల్లో మొదటి, రెండు, మూడవ స్థానాల్లో నిలిచిన వారికి ఎస్పీ సతీమణి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఇన్‌ఛార్జి డీఎస్పీ ఎస్.మహబూబ్ బాషా, దిశ డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్బి సిఐ ఇందిర, ఆర్ఐ హరికృష్ణ పాల్గొన్నారు.

సిఐటియు మహాసభలను జయప్రదం చేద్దాం..

కార్యక్రమంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

అనంతపురం కలెక్టరేట్ : ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు బెంగళూరులో సిఐటియు అఖిల భారత మహాసభలు నిర్వహించనున్నట్లు సిఐటియు జిల్లా కోశాధికారి గోపాల్, గ్రామ పంచాయతీ ఉద్యోగులు కార్మికుల యూనియన్ జిల్లా కార్యదర్శి శివప్రసాద్ తెలిపారు. సోమవారం అనంతపురం నగరంలోని రుద్రంపేట సర్కిల్ సిఐటియు నగర న్యూ కమిటి ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర న్యూకమిటీ అధ్యక్షులు గురురాజు, ఆవాజ్ నగర న్యూ టౌన్ కమిటి కార్యదర్శి ఇర్ఫాన్, ఆటో యూనియన్ అధ్యక్షుడు అజామ్, కార్యదర్శి ఆది తదితరులు పాల్గొన్నారు.

12న 2కె రన్ : డివైఎఫ్ఐ

అనంతపురం కలెక్టరేట్ : భారత ప్రజాతంత్ర యువజన సమైఖ్య (డివైఎఫ్ఐ) ఆధ్వర్యంలో ఈ నెల 12న స్వామి వివేకానంద జయంతి సందర్భంగా అనంతపురం నగరంలోని కెఎస్ఆర్ కళాశాల నుంచి రామ్ నగర్ ఫ్లై ఓవర్ వరకు 2కె రన్ నిర్వహిస్తున్నట్లు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బాలకృష్ణ, నరసింహారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సై కానిస్టేబుల్ ఉద్యోగం కోసం పోటీపడుతున్న అభ్యర్థులకు ఎంతగానో తోడ్పడుతుందన్నారు. వారి యొక్క శక్తి సామర్థ్యాలతో, పాటు వారిలో ఆత్మవిశ్వాసం పెరగడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కావున జిల్లాలోని యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ 2కె లో ప్రతిభ కనబరిచిన వారికి సర్టిఫికెట్‌తో పాటు నగదు ప్రోత్సాహక బహుమతులు ఉంటాయని తెలిపారు.

జెఎన్‌టియు విసి రంగజనార్ధన్‌ను అభినందిస్తున్న వర్శిటీ సిబ్బంది

ఐఎస్‌టిఇ ఎపి సెక్షన్ ఛైర్మన్‌గా జెఎన్‌టియు విసి

ప్రజాశక్తి-అనంతపురం

ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఎపి సెక్షన్ ఛైర్మన్‌గా జెఎన్‌టియు ఉపకులపతి రంగజనార్ధనను నియమిస్తూ ఐఎస్‌టిఇ జాతీయ అధ్యక్షుడు ప్రతాప్ సిన్హా.కె.దేశాయి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రంగజనార్ధన మాట్లాడుతూ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు, విద్యార్థుల పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను నిర్ణీత సమయంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే టెక్నికల్ ఎడ్యుకేషన్‌లో ప్రతిభావంతులైన అధ్యాపకులు, విద్యార్థులకు నిర్ణీత సమయంలో పథకాలు ద్వారా ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భగా ఐఎస్‌టిఇ ఎగ్జిక్యూటివ్ కమిటీ తరపున ప్రస్తుత సెక్రటరీ బి.ఈశ్వర్‌రెడ్డి, రిజిస్ట్రార్ సి.శశిధర్, యూనివర్సిటీ డైరెక్టర్లు పి.ఆర్.భానుమూర్తి, ఇ.కేశవరెడ్డి, వి.సుమలత, ఎస్.వసుంధర, శోభాబిందు, ఒటిపిఆర్ఐ డైరెక్టర్ బి.దుర్గాప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ పి.సుజాత, పులివెందుల కళాశాల ప్రిన్సిపాల్ రాజు, ఎస్‌వి.సత్యనారాయణ, తదితరులు విసికి పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించండి

బొమ్మనహాల్‌లో వినతిపత్రం సమర్పిస్తున్న అంగన్‌వాడీలు

సిఐటియు ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా నిరసనలు

ప్రజాశక్తి-ఉరవకొండ

అంగన్వాడీలకు ఫేస్‌యాప్ తీసివేయడంతోపాటుకనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు విజయలక్ష్మి, అరుణకుతమ్మ, మద్దిదేవి డిమాండ్ చేశారు. మంగళవారం విడపనకల్లు మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు ఫేస్ యాప్ పెట్టడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతేగాకుండా పర్యవేక్షణ పేరుతో అంగన్‌వాడీ సెంటర్లలో కార్యకర్తలు, ఆయాలను వేధించడంతోపాటు మనోవేదనకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ గోవిందరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వన్నప్పకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు చెన్నరాయుడు, అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ యూనియన్ నాయకులు మల్లేశ్వరి, భారతీదేవి, సునీత, వరలక్ష్మి, రుక్మిణీ, త్రివేణి, సర్వలత, భాగ్యమ్మ, నిర్మలాదేవి, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నార్పల : అంగన్వాడీ కార్యకర్తలకు ప్రవేశపెట్టిన ఫేస్ యాప్‌ను వెంటనే రద్దుచేసి పౌష్టికాహారం నాణ్యతను పెంచాలని మండలంలోని అంగన్‌వాడీలు తహశీల్దార్ సురేష్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలకు ఉన్న ఫేస్‌యాప్‌ను రద్దు చేయాలని, సెంటర్లకు పంపిణీ చేసే పౌష్టికాహారం నాణ్యత పెంచాలని, వంటగ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5లక్షలు ఇవ్వాలని, సగం వేతనం పెన్షన్ రూపంలో అందించాలని, సీనియార్టీ ప్రకారం వేతనాలు అందించాలని, సూపర్‌వైజర్ పోస్టుల రిక్రూట్మెంట్‌కు వయోపరిమితి తొలగించాలని, హెల్పర్లకు ఇచ్చే ప్రమోషన్లలో వయోపరిమితి 50 సంవత్సరాల వరకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోని మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండలంలోని అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అరకొర సౌకర్యాలతో అంగన్వాడీలను నడుపుతున్న అంగన్‌వాడీ వర్కర్ల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడం బాధాకరమన్నారు. వెంటనే అంగన్‌వాడీలకు నూతనంగా తీసుకొచ్చిన ఫేస్‌యాప్‌ను తొలగించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పదవీ విరమణ బెనిఫిట్ రూ.5లక్షలు ఇవ్వాలని, అంగన్‌వాడీల్లో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

పుట్లూరు : అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రవేశపెట్టిన ఫేస్‌యాప్‌ను వెంటనే రద్దుచేసి పౌష్టికాహార నాణ్యతను పెంచాలని మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్ సుమతికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలోని మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రవేశపెట్టిన ఫేస్ యాప్‌ను రద్దు చేసి పౌష్టికాహారం నాణ్యతను పెంచాలని కోరుతూ మండలంలోని అంగన్‌వాడీలు మంగళవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ వరప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలోని మండలంలోని అంగన్‌వాడీలు జయలక్ష్మి, నాగలక్ష్మి, లక్ష్మీదేవి, సరోజమ్మ, నాగమణి, చౌడేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో తహశీల్దార్ మహబూబ్‌బాషాకు వినతిపత్రం సమర్పిస్తున్న అంగన్‌వాడీలు, సిఐటియు నాయకులు

గుత్తి : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు అనుబంధ సంస్థ ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి వి.నిర్మల మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫేస్‌యాప్‌ను రద్దు చేయాలన్నారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, సీనియార్టీ ప్రకారం వేతనాలు ఇవ్వాలని, సూపర్‌వైజర్ పోస్టుల్లో వయోపరిమితిని తొలగించాలని, పదోన్నతుల్లో రాజకీయ జోక్యం ఉండరాదని డిమాండ్ చేశారు. అలాగే ర్యాలీలు, సభలను నిషేధిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 1 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ ఎస్.మహబూబ్ బాషాకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్లు శోభారాణి, నాగరత్న, పార్వతి, బావమ్మ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఉరవకొండ : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన విడపనకల్లు మండలం పరిధిలోని మాలాపురం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. మాలాపురం గ్రామానికి చెందిన సి.వెంకటస్వామి(65) తన టీవీఎస్ 50 ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి వస్తుండగా ప్రధాన రోడ్డుపైకి రాగానే విడపనకల్ గ్రామానికి చెందిన మురళి లగేజ్ ఆటో ఢీకొంది. దీంతో వెంకటస్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మృతుని భార్య ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించింది. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విడపనకల్లు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పారదర్శకంగా సర్వే చేయాలి

రాయదుర్గం రూరల్ : గ్రామాల్లో భూములకు సంబంధించిన సర్వే పారదర్శకంగా చేయాలని ఇఒఆర్‌డి రఘురామ్‌రావు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వే బృందంతో నిర్వహించిన సమావేశంలో జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూ రక్ష పథకానికి 74-ఉడేగోళం, కొంతానాపల్లి, చదం, అవులదట్ల, మెచ్చిరి గ్రామాలు ఎంపికైనట్లు చెప్పారు. సర్వే బృందాలకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వేణు, కొల్లప్ప, అశోక్, భీమేష్ , హేమంత్ రాజు, బసవరాజు, యల్లక్క, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులకు అవగాహన

అనంతపురం : అనంతపురం రూరల్ పరిధిలోని మన్నీల రైతు భరోసా కేంద్రంలో సర్పంచి త్రిలోక్ అధ్యక్షతన కౌలురైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా కౌలురైతులకు గుర్తింపు కార్డులు, ప్రభుత్వం నుంచి అందే పథకాల గురించి వివరించారు. అలాగే ఇటీవల ఆత్మహత్య చేసుకున్న కౌలు రైతు నారాయణప్ప కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.7 లక్షల చెక్కు ఆందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వరప్రసాద్, విస్తరణ అధికారులు మురళీకృష్ణ, ప్రసాద్, మాజీ సర్పంచి ఆదిశేషు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డివిజనల్ అభివృద్ధి అధికారిణి ఓబుళమ్మ

శింగనమల : మండలంలోని పలు గ్రామ సచివాలయాలను డివిజనల్ అభివృద్ధి అధికారి ఓబుళమ్మ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల పరిధిలోని సలకంచెరువు, సోదనపల్లి, శింగనమల గ్రామ సచివాలయాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ అధికారులు సమయ పాలన పాటించాలన్నారు. అంతేగాకుండా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. ఎవరైనా విధులకు సక్రమంగా హాజరుకాకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నిర్మలాకుమారి, ఇఒఆర్‌డి శివనారాయణరెడ్డి, వీఆర్వో తాతయ్య, పంచాయతీ కార్యదర్శులు రామాంజనేయులు, సోషల్ వెల్ఫేర్ నాగేంద్ర, గ్రామ సచివాల సిబ్బంది, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రంగనాథ స్వామి ఆలయానికి రూ.12.36 లక్షల ఆదాయం

గుత్తి : మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన శ్రీ బొలికొండ రంగనాథస్వామి ఆలయానికి రూ.12.36 లక్షల ఆదాయం లభించినట్లు దేవాదాయ ధర్మదాయ శాఖ అధికారులు తెలిపారు. ఈమేరకు టెంకాయల విక్రయ హక్కు కోసం ఆలయ ఆవరణలో మంగళవారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ రామతులసి సమక్షంలో బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా ఆర్లగడ్డ మండలం చాగలమర్రి గ్రామానికి చెందిన దేవా రూ.4.21 లక్షలకు వేలంపాట దక్కించుకున్నాడు. గతంలో రూ.3.20 లక్షలు వచ్చినట్లు కార్యనిర్వాహణాధికారి వి.దేవదాసు తెలిపారు. అలాగే ఫిబ్రవరి 8వ తేదీ నుంచి ఏడాది పాటు ఆలయం వద్ద టెంకాయలు విక్రయ హక్కు కోసం వేలంపాట నిర్వహించగా పెద్దపప్పూరు మండలం తిమ్మనచెరువు గ్రామానికి చెందిన ఎం.నాగరాజు రూ.8.15 లక్షలతో వేలంపాట పాడి హక్కును దక్కించుకున్నాడు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి ప్రవీణ్ కుమార్‌యాదవ్, తొండపాడు సింగిల్‌విండో అధ్యక్షుడు ఎన్.పురుషోత్తంయాదవ్, దేవాదాయా శాఖ సిబ్బంది రామకృష్ణ, బాలమోహన్, తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

నార్పల : మండల పరిధిలోని బి.పప్పూరు గ్రామంలో సాగుచేసిన వేరుశనగ, కంది, మొక్కజొన్న పంటలను డిఆర్‌సి ఎడి, శాస్త్రవేత్తలు మంగళవారం పరిశీలించారు. ఇందులో భాగంగా వేరుశనగ, మొక్కజొన్న పంటలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులతోపాటు పురుగు, తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌సి ఎడి శైలజాకుమారి, శాస్త్రవేత్త డాక్టర్ శశికళ (రెడ్డిపల్లి కెవికె), ఎఒ రుమానా బేగం, శంకర్‌లాల్ నాయక్, జిల్లా అగ్రి అడ్వైజరీ సభ్యుడు పెద్దిరెడ్డి, ఎఇఒ శైలజ, విహెచ్‌ఎ సాయిలీల, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'ఆర్జీవీ.. ఇష్టానుసారంగా మాట్లాడితే సహించం'..

అనంతపురం : సినీ దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ ఇంకోసారి పవన్‌కళ్యాణ్ గురించి మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడకపోతే సహించేది లేదని రాయలసీమ బలిజ మహాసంఘం అధ్యక్షులు పాముఠాయి వెంకటేష్ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. రామ్‌గోపాల్‌వర్మ కాపు కుల పెద్దల పట్ల ఎలాంటి సంబంధం లేకున్నా కారుకూతలు కూస్తుంటే చూస్తూ ఊరుకునేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు, సమాజం పట్ల కనీస అవగాహన లేని ఆంబోతు వర్మ అని ఎద్దేవా చేశారు. అలాంటి వ్యక్తి బాధ్యత కలిగిన ఒక నేతగా ఎన్నో సమస్యలతో ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న పవన్‌కళ్యాణ్ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. ప్రజల కోసం నిరంతరం పాటుపడే జనసేన అధినేత పవన్, చంద్రబాబు కలయికతో ఆర్జీవికి వచ్చిన నష్టం ఏంటో చెప్పాలన్నారు. ఇంకోసారి పవన్‌కళ్యాణ్ గురించి తప్పుగా మాట్లాడితే బహిరంగంగా శిక్షిస్తామని హెచ్చరించారు.

పెన్షనర్స్ సంఘం డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

అనంతపురం కలెక్టరేట్ : అనంతపురం జిల్లా పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2023 సంవత్సరం డైరీ కమ్ హ్యాండ్‌బుక్, క్యాలెండర్‌ను జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆవిష్కరించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని ఛాంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.పెద్దన్నగౌడ్, శీలా జయరామప్ప తదితరులతో కలిసి డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెన్షనర్‌లకు ఎంతో ఉపయోగపడేలా డైరీ, క్యాలెండర్ రూపొందించడం అభినందనీయం అన్నారు. మెడికల్ సంబందించిన అంశాలు చాలా విశదీకరించి పొందుపరిచడం బాగుందని సంఘం నాయకులను ప్రశంసించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సంఘం నాయకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం జిల్లా కోశాధికారి రామకష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రభాకర్, ఉపాధ్యక్షులు తిప్పన్న, రమేష్, మహమ్మద్, సంయుక్త కార్యదర్శి పుల్లప్ప, ఈసీ మెంబెర్స్ వేణుగోపాల్, మధు పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

జీవో 1ని రద్దు చేయాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు

రాష్ట్ర ప్రభుత్వ నూతనంగా తీసుకొచ్చిన జీవో నెం.1ను వెంటనే రద్దు చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యురాలు రమాదేవి, జిల్లా కమిటీ సభ్యురాలు జయమ్మ, మండల కమిటీ నాయకులు శివశంకర్ మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో సమావేశాలు, సమ్మెలు, ధర్నాలు, నిరువధిక దీక్షలు, ఉద్యమాలు చేయరాదని రాష్ట్ర ప్రభుత్వం జీవో 1ను తీసుకురావడం బాధాకరమన్నారు. ఈ జీవో కార్మికవర్గాన్ని బానిస సమాజంలోకి నెట్టే విధంగా భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 19 భావ ప్రకటన స్వేచ్ఛను హరిస్తోందన్నారు. ప్రజల భావ ప్రకటన స్వేచ్ఛను హరించే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి లేదన్నారు. జీవోను వెంటనే ఉపసంహరించుకోకపోతే రాబోయే కాలంలో కార్మికవర్గాన్ని బలోపేతం చేసి ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంగళ, అంగన్వాడీ విజయలక్ష్మి, నాగరత్నమ్మ, చామండేశ్వరి, లక్ష్మీదేవి, సరోజమ్మ, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల పరిశీలన

ప్రజాశక్తి-గార్లదిన్నె

కూలీల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న పీడీ వేణుగోపాల్‌రెడ్డి

మండల పరిధిలోని ఇల్లూరు గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన సప్లయ్ ఛానల్ కాలువ పూడికతీత పనులను నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో ఎన్ని గంటలు పనిచేస్తున్నారు.. రోజువారి కూలి ఎంత పడుతోంది.. అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పని దగ్గర వసతులు ఏ విధంగా ఉన్నాయి అనే వివరాలు కూలీలతో చర్చించారు. పనులు పారదర్శకంగా నిర్వహించాలని, దినసరి కూలి రూ.257 పడేటట్లు ఎక్కువ సమయం పనులు చేయాలని సూచించారు. అనంతరం గార్లదిన్నె ఎంపిడిఒ కార్యాలయంలో గార్లదిన్నె, శింగనమల, పెద్దవడుగూరు, పామిడి, గుత్తి మండలాలకు సంబంధించిన ఎపిఒలు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్లతో ఆయా మండలాలలో జరుగుతున్న ఉపాధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపిడి విజయ్‌కుమార్, గార్లదిన్నె ఎపిఒ నాంచారమ్మ, ఇసి విజయ్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు ఆనంద్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు

గర్భిణులతో మాట్లాడుతున్న డాక్టర్ సుల్తాన్

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని వైద్యాధికారిణి సుల్తాన్ సూచించారు. ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక గ్రామీణ ఆరోగ్య కేంద్రంలో గర్భిణలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా హైరిస్క్ గర్భిణులు, గత కాన్పులో సిజేరియన్ అయిన వాళ్లు, హైట్ తక్కువ ఉన్నార, రక్తపోటు సమస్య, గుర్రపు వాతం లాంటి సమస్యలు ఉన్న వారికి ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ చంద్రావతి, ఎంపిహెచ్‌ఇఒలు నాగేశ్వరయ్య, మునాఫ్, సూపర్‌వైజరు రత్నమ్మ, ఎఎన్‌ఎంలు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి కరణం పుష్పావతి

ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలి : ఎంపిపి

ఉరవకొండ : వైద్యసిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని పెద్దకొట్టాలపల్లిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అభివృద్ధి సలహా మండలి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందన్నారు. ముఖ్యంగా చికిత్స కోసం ఆసుపత్రికి వస్తున్న వారిపట్ల దురుసుగా ప్రవర్తించకుండా సమస్యను తెలుసుకుని చికిత్స చేయాలన్నారు. అలాగే వైద్యసిబ్బంది గ్రామాల్లో పర్యటించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. అనంతరం ఆసుపత్రిలోని వార్డుల్లో పర్యటించి సౌకర్యాలపై రోగులను ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు హరినాథ్‌రెడ్డి, శ్రీకాంత్‌బాబు, వైసిపి రాష్ట్ర నాయకులు కరణం భీంరెడ్డి, సూపర్‌వైజర్ నాగశంకర్, ఎంపిహెచ్ఇఒ తిరుపాల్‌నాయక్, అభివృద్ధి సలహా మండలి కమిటీ సభ్యులు మోదుపల్లి బాబు, లింగన్న, వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల మెయిన్ గేటు ఏర్పాటుకు భూమిపూజ

ఉరవకొండ:నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా విడపనకల్ మండల పరిధిలోని పెద్ద కొట్టాలపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మెయిన్ గేట్ ఏర్పాటుకు మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మోదుపల్లి రామాంజనేయులు మాట్లాడుతూ పాఠశాలకు మెయిన్ గేటు నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే ఆయన సహాయ సహకారాలతో గ్రామంలో అభివృద్ధి పనులు పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, వార్డు మెంబర్ మోదుపల్లి మురళీమోహన్, వైసిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

బీసీల రాజ్యాధికారమే ధ్యేయం

బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు నీలూరి రుషింగప్ప

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

రాజ్యాధికారమే ధ్యేయంగా బిసిలందరూ ఏకతాటిపైకి వచ్చి పోరాటాలని బిసి మహాసభ రాష్ట్ర అధ్యక్షులు నీలూరి రుషింగప్ప పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలోని కృష్ణస్వామి ఆలయంలో బీసీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో ఏర్పాటు కానున్న చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ తరపున రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో 175 స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. 'ఓటు మాదే.. సీటు మాదే.. రాజ్యాధికారం మాదే' అనే దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 136 కులాలు 56 శాతం బీసీలు ఉన్నా రాజ్యాధికారం రాలేదన్నారు. తక్కువ శాతం ఉన్న కులాలు రాజ్యాలు ఏలుతున్నాయన్నారు. కాబట్టి బీసీలందరూ ఐకమత్యమై హక్కుల కోసం పోరాటాలన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత ఐక్యవేదిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగం రామచంద్ర, బీసీ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఫక్రుద్దీన్, బీసీ సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, జక్క రమేష్, నగరం బ్రహ్మయ్య, హుస్సేన్‌పీరా, చేనేత నాయకులు శేఖర్, నాగరాజు, ధన, ఆంజనేయులు, రంగా, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టించుకోని ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్

ప్రజాశక్తి-గుత్తి

ప్రజా సమస్యలను పరిష్కరించడంతో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్ విమర్శించారు. మంగళవారం మండలంలోని పి.ఎర్రగుడి గ్రామంలో ఇదేంకర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో కనీస సౌకర్యాలు లేక సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీఎం జగన్ అన్ని రంగాలకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు జీతాలు, విశ్రాంత ఉద్యోగులకు పింఛన్లు సకాలంలో ఇవ్వలేని జగన్‌కు రాష్ట్రాన్ని పాలించే హక్కు లేదన్నారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా జగన్ పరిపాలన కొనసాగిస్తున్నారంటే ఆయన అసమర్థ పాలన గురించి అర్థం అవుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు సైకిల్ గుర్తుకు ఓటు వేసి చంద్రబాబును సిఎం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్‌గౌడ్, నాయకులు ఆర్.హరినాథ్‌గౌడ్, అనిల్‌గౌడ్, మండల, పట్టణ కన్వీనర్లు బర్దివలి, రవి శంకర్‌గౌడ్, మహ్మద్‌అలీ, అగ్గిరాముడు, హనుమంతురెడ్డి, రమేష్, వంకాయల శీనా, మాజీ కౌన్సిలర్ సుంకన్న, మాజీ సర్పంచులు తిరుపాలు, వైకుంఠ, సుధీర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్

In the Court of the Principal Senior Civil Judge CUM CJM At Ballari
M.V.C.No.8/2020
Between:
Lingamurthy ...Petitioner
And
Prasanna Kumar and Others ...Respondents
NOTICE
NOTICE TO RESPONDENT No.1
Prasanna Kumar son of D.Rajashekar, driver of the Ashok Layland lorry bearing Reg.No.AP 02/TE 4155 R/o. D.NO.20-104, Prabhakar Nagar, Lalband Street, Old Town, Ananthapur Post, Andhra Pradesh.
WHEREAS, the above petitioner has filed the above claim petition under section 166 of IMV Act against you being the driver of the Ashok Layland lorry bearing Reg.No.AP 02/TE 4155, for seeking compensatin for injuries sustained to him in a motor vehicle accident on 08-09-2019 at about 8.00 p.m. breeze nearby Sankarrbanda Village within jurisdiction of Rural Police Station, Ballari.
You are hereby directed to appear in this court in person or by a pleader duly instructed on 02-02-2023 at about 11.00 a.m. in the forenoon before this Honourable court to show cause against he above petition, failling wherein the petition will be heard and determined ex-parte.
Given under my hand and seal of the court on this 10 day of January, 2023.
(By Order of the Court)
(JALLE HANUMANTHAPPA) Advocate for Petitioner
Chief Ministrial Officer Prl.Sr CJ & CJM Court, Ballari

'పది'లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

ఉరవకొండ : పదవ తరగతితోపాటు ఇంటర్మీడియట్ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని విడపనకల్ ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి సూచించారు. మంగళ వారం విడపనకల్ మండల పరిధిలోని మాలాపురం గ్రామంలో ఉన్న కెజిబివి పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడు తూ రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే నాడు-నేడు పనులను చేపట్టి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తోందన్నారు. అంతేకాకుండా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన, విద్యతోపాటు పౌష్టికాహార పదార్థాలను అందించి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేసి విద్యా ర్థుల బంగారు భవిష్యత్తు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడుతూ మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందిస్తున్నారా.. లేదా.. అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కెజిబివి ఇన్‌ఛార్జి స్పెషల్ ఆఫీసర్ తారాదేవి, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ సింగాడి వీరప్ప, వైసిపి నాయకులు మాలాపురం రామాంజనేయులు, ఓబులేసు, శ్రీరాములు, సుంకన్న, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

Kalyandurgam Municipality
e Procurement Tender Notice
Tender Notice NO.10/2022-23 & 31 to 36/2022-23, 15th FC & Municipal Funds

Name of Scheme	15th FC and General Funds
No. of Works	6 Nos
Works	BT Road, Pipeline, Compound Wall and Repair of Potholes,
Total Estimated Amount	81.64 lak
Name and Address of Concerned Officer	

Municipal Commissioner, Kalyandurgam Municipality, Kalyandurgam.
(Further Details can been seen @ e-procurement market place at **www.tender.eprocurement.gov.in**)
Sd/- K.Venkatesulu
Municipal Commissioner, Kalyandurgam, Municipality

సంక్రాంతి సంబరాలు

అనంతపురం : నగరంలోని శ్రీచైతన్య పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన ముందస్తు సంక్రాంతి సంబరాలను ఎజిఎం సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎజిఎం మాట్లాడుతూ సూర్యుడు మకర రాశిలోకి మారిన రోజు మనకి మకర సంక్రాంతి వస్తుందన్నారు. పండుగను రెండు తెలుగు రాష్ట్రాలు మూడు రోజులపాటు సంప్రదాయ పద్ధతిలో ఘనంగా నిర్వహించుకుంటాన్నారన్నారు. అనంతరం చిన్నపిల్లల హరిదాసు, సంప్రదాయ వేషధారణలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తబస్సు, అకడమిక్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఎఒ గోపాల్, డీన్లు రుషిబాల, అప్పలనాయుడు, ప్రైమరీ ఇన్‌ఛార్జి నీరజ భారతి, ప్రీ ప్రైమరీ ఇన్‌ఛార్జి కరుణ, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : సంక్రాంతి పండుగను వేడుకల్లో భాగంగా పట్టణంలోని శ్రీ వివేకానంద ఇన్స్‌ట్యూట్ ఆఫ్ సైన్స్ ఎంబిఎ, ఎంసిఎ కళాశాలలో మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఓంకారప్ప మాట్లాడుతూ ఈనెల 12న స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రైతే రాజు, ఆడబిడ్డ ప్రాముఖ్యత, వివేకానంద చిత్రాలను ముగ్గులు రూపంలో ప్రదర్శించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా హార్ కైండ్ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ రేణుకాదేవి, కార్యదర్శి జ్యోతి వ్యవహరించారు.

పుట్లూరు : మండల కేంద్రంలోని రాయలసీమ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఇందులో విద్యార్థినీ, విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో పేరెంట్స్ విభాగంలో మొదటి బహుమతి గీతాంజలి, రెండవ బహుమతి కె.శ్రీదేవి, మూడో బహుమతి బి.శ్రీదేవి, టీచర్స్ విభాగంలో మొదటి బహుమతి వి.హేమ, రెండో బహుమతి కె.మారుతి, మూడవ బహుమతి పి.చంద్రకళ సాధించారు. విజేతలకు కరస్పాండెంట్ ఎస్.రమేష్‌రెడ్డి బహుమతులు అందజేశారు.



పుట్లూరులో ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం